

దసరా ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

దసరా మహోత్సవాలకు జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్తు దీపాల అలంకరణతో వెలుగులీనుతున్నాయి. ప్రత్యేక సెట్టింగులు, అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. కడపలోని అమ్మవారిశాల, విజయదుర్గాదేవి, ప్రొద్దుటూరు అమ్మవారిశాల తదితర ఆలయాలు ప్రత్యేకశోభను సంతరించుకున్నాయి. ప్రొద్దుటూరులోని అమ్మవారిశాల, శివాలయం, ఎగ్జిబిషన్ ప్రాంతాలను బుధవారం ఎస్పీ హర్షవర్ధన్ రాజు పరిశీలించారు. ట్రాఫిక్ ఎలాంటి అవాంతరం లేకుండా, చోరీలు జరగకుండా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయనవెంట డీఎస్పీ భక్తవత్సలం, సీఐలు రామకృష్ణారెడ్డి, యుగంధర్, గోవిందరెడ్డి, బాలమద్దిలేటి, సిబ్బంది తదితరులున్నారు.

- న్యూస్‌టుడే, మారుతీనగర్, ప్రొద్దుటూరు నేరవార్తలు



ముస్తాబైన కడప అమ్మవారిశాల

ఈనాడు వైయస్సార్
గురువారం అక్టోబరు 3, 2024

తాగునీటి సమస్యకేదీ చికిత్స?



కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిరుపయోగంగా జల్ మందిర్

తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఉప్పు నీటితో వైద్యపరికరాలు పాడైపోతున్నాయి. వైద్య సేవలందించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దంత వైద్య కళాశాలలో నీటి వినియోగం అధికంగా ఉంటుంది. వెంటనే సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయండి.

- ఇటీవల రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో కడప దంత వైద్య కళాశాల వైద్యుల మొర

కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నీటి కొరత ఆశ్చర్యం కలిగిస్తోంది. ఏళ్ల తరబడి వైఎస్ కుటుంబమే పాలిస్తున్నా ఎందుకు పట్టించుకోలేదు. నీటి కొరత లేకుండా చూడాలని కలెక్టర్‌కు ఆదేశాలిచ్చాం. శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- సత్యకుమార్, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖమంత్రి

కడపలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. జిల్లా నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులుగా పని చేసినా శాశ్వత పరిష్కారం చూపలేకపోయారు. కడపలోని మురుగునీరు పెన్నాలోకి వెళుతుంది. అక్కడ నుంచి బోర్లు ద్వారా ఆ నీటినే నగరానికి పంపింగ్ జరుగుతున్న దుస్థితి నెలకొంది. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించాం. ఇప్పటికే కార్య సాధన దిశగా అడుగులు వేగంగా వేస్తున్నాం.

- తాజాగా దంత కళాశాల మినీ ఆడిటోరియం ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవిరెడ్డి

కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో దాహం కేకలు

ఫ్లోరైడ్ నీటితో వైద్యపరికరాలు, యంత్రాలకు ముప్పు

- ఈనాడు, కడప, న్యూస్‌టుడే, సర్వజన ఆసుపత్రి

దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి మానసపుత్రికగా చెప్పుకొనే కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఏర్పాటు చేసి 15 ఏళ్లు దాటినా నేటికీ మంచినీటి కొరత వెంటాడుతోంది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన తనయుడు జగన్ జిల్లా నుంచి ముఖ్యమంత్రులుగా పదేళ్ల పాటు పని చేసినా ఆసుపత్రి దశ మాత్రం మారలేదు. అప్పటి పురపాలకశాఖతో ఒప్పందం మేరకు రోజుకు 2.5 గ్యాలన్ల నీరందించాల్సి ఉండగా.. ఒక గ్యాలన్ నీరు మాత్రమే సరఫరా అవుతోంది. ఫలితంగా వైద్యులు, సిబ్బంది, ప్రత్యేకించి రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రితో పాటు సూపర్‌స్పెషాలిటీ, క్యాన్సర్ ఆసుపత్రి సైతం అందు బాటులోకి వచ్చాయి. దీంతో నీటి వినియోగం భారీగా పెరిగినా ఆమేరకు సరఫరా జరగడంలేదు. సమస్య శాశ్వత పరిష్కారానికి ఎన్డీయే ప్రభుత్వంపై అన్ని వర్గాలు ఆశలు పెట్టుకున్నాయి.

● సుమారు 182 ఎకరాల్లో నిర్మించిన కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ చేతులమీదుగా ప్రారంభించారు. రాయలసీమకే తలమానికంగా ఆధునిక పద్ధతిలో 730 పడకల సామర్థ్యంతో నిర్మించిన ఈ ఆసుపత్రి 2019లో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా రూపాంతరం చెంది 2023 నాటికి 930 పడకలకు విస్తరించింది. రోజుకు 1,500 మంది అవుట్ పేషెంట్లు, 700 నుంచి 730 మంది వరకు ఇన్ పేషెంట్లు వైద్యసేవలు పొందుతున్నారు.

● ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, పల్మనాలజీ, రేడియాలజీ, అనస్థీసియాలజీ, డెంటస్ట్రీ, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాలున్నాయి. అన్ని విభాగాలకు కలిపి వైద్యులు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది కలిపి 942 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 692 మంది పని చేస్తున్నారు. మిగిలిన 250 వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్య కళాశాలలో దాదాపు వెయ్యి మందికి పైగానే మెడికోలు విద్యనభ్యసిస్తున్నారు. ఇవి కాకుండా ఇటీవలే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మానసిక వైద్యశాల, కాన్సర్ ఆసుపత్రి ప్రారంభమయ్యాయి.

● అన్ని విభాగాల వైద్యులు, వైద్య సిబ్బందితోపాటు రోగులు, వారి సహాయకులకు మంచినీటి కొరతను తీర్చడంలో గత పాలకులు విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రి ప్రారంభంలోనే 2.5 గ్యాలన్ల తాగునీరు నిత్యం ఇవ్వాలని నగరపాలక సంస్థగా రూపాంతరం చెందిన గత పురపాలక సంఘంతో ఒప్పందం జరిగింది. ప్రస్తుతం గ్యాలన్ నీరు కూడా సరఫరా కావడంలేదు. ఆసుపత్రి ఆవరణలో 8 బోరు బావుల ద్వారా నీరు సరఫరా చేస్తున్నా ఫ్లోరైడ్ శాతం అత్యధికంగా ఉండటంతో పైపులన్నీ పాడైపోతున్నాయి. ఫలితంగా వివిధ విభాగాలకు మంచి నీరు అందడంలేదు.

● ముఖ్యంగా ల్యాబొరేటరీలకు నీరు సరఫరా కాకపోవడంతో వైద్య సిబ్బంది పరీక్షలు చేయడానికి అష్టకష్టాలు పడుతున్నారు. నీటితో వినియోగించే వైద్య పరికరాలు సైతం ఫ్లోరైడ్ కారణంగా మరమ్మతులకు గురవుతున్నాయి. పలువురు దాతల సహకారంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు సైతం నీటి కొరతతో మూతపడ్డాయి. ఇక్కడకొచ్చే రోగులతో పాటు వారి సహాయకులు తాగునీటి సీసాలను వెంట తెచ్చు కోవాల్సిన దుస్థితి నెలకొంది. కడప నగరపాలక సంస్థ పూర్తి స్థాయిలో నీటిని సరఫరా చేసే పక్షంలో సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.



ఖాళీ తాగునీటి సీసాలతో ఎదురు చూస్తున్న రోగుల సహాయకులు



నీరందించని కుళాయిని చూపుతూ...



ఫ్లోరైడ్ నీటితో పాడైన పైపులైన్లు

వాటర్‌గండిలో పైపులైన్ల సమస్య

వాటర్‌గండిలో పైపులైన్లు పగిలిపోవడంతో కడప నగరానికి మూడో వంతు నీటిని సైతం సరఫరా చేయలేకపోతున్నాం. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి నీటిని అందించడానికి మరో నెల రోజుల సమయం పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆసుపత్రికి ఒప్పందం మేరకు నీటిని సరఫరా చేయలేకపోతున్నాం. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

- నందన్, కమిషనరు, కడప నగరపాలక సంస్థ

మహాత్ముని అడుగుజాడల్లో నడవాలి : ఎస్పీ



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ హర్ష వర్ధన్‌రాజు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మహాత్మాగాంధీ అడుగు జాడల్లో నడవాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. జాతిపిత జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి టెట్ పరీక్షలు

కడప విద్య, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా 8 కేంద్రాల్లో నేటి (గురువారం) నుంచి ఈ నెల 21వ తేదీ వరకు ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఏపీ టెట్) జరగనుంది. కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు జిల్లాలో 23,044 మంది హాజరుకానున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రెండు విడతల్లో పరీక్ష నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయం కన్నా అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు, పరీక్ష కేంద్రాల వివరాలకు 94415 57508, 91333 56786, 98660 41341 నంబర్లలో సంప్రదించాలని డీఈవో అనురాధ తెలిపారు. పరీక్ష కేంద్రాలలో ఎటువంటి అవాంతరాలు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని టెట్ జిల్లా పరిశీలకుడు మధుసూదనరావు విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని టెట్ పరీక్ష కేంద్రాలను బుధవారం పరిశీలించిన అనంతరం డీఈవో అనురాధతో పాటు డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమీక్షించారు.

కడపలో కార్ల కేసు కలకలం!

ఇద్దరు నిందితుల అరెస్టు ■ రూ.2 కోట్ల విలువైన 37 వాహనాల స్వాధీనం



పోలీసు అధికారులతో కలిసి కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ హర్ష వర్ధన్‌రాజు

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, కడప నేర విభాగం: 'ప్రభుత్వ అధికారులు పరిచయం ఉన్నారు.. వారికి కార్లు అద్దెకు పెడతాం.. నెలకు రూ.30 వేలు చెల్లిస్తాం' అని పలువురు కారు యజమానులను మోసగించిన కేసును కడప పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి రూ.2 కోట్ల విలువైన 37 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు వెల్లడించారు. కడప పోలీసు మైదానంలో బుధవారం స్వాధీనం చేసుకున్న వాహనాలను ప్రదర్శించడంతో పాటు కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. 'తన మూడు కార్లు తీసుకుని మొదటి రెండు నెలలు అద్దె చెల్లించి.. ఆ తర్వాత అద్దె ఇవ్వకుండా.. వాహనాలు స్వాధీనం చేయకుండా మోసం చేస్తున్నారని నబీకోటకు చెందిన బాధితుడు వీరేందర్ ఫిర్యాదుతో తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వీరేందర్ వాహనాలతో పాటు మరో 34 కార్లను నబీకోటకు చెందిన వెంకట శశిధర్‌రెడ్డి, షేక్ జిలానీ అద్దెకు తీసుకుని వాటిని కుదవ పెట్టినట్లు దర్యాప్తులో తేలింది' అని ఎస్పీ వివరించారు. 'ఒక ఫిర్యాదుతో ప్రత్యేకంగా మూడు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి 37 వాహనాలను వివిధ ప్రాంతాల నుంచి స్వాధీనం చేసుకోవడంతో పాటు బాధితులకు సమాచారం ఇచ్చాం. వాహన యజమానులను మోసం చేసిన నిందితులను అదుపులోకి తీసుకున్నాం. ఒకటో నిందితుడు వెంకట శశిధర్ రెడ్డి గతంలో ఓ కార్ల కంపెనీ పనిచేస్తూ ఆరోగ్య సమస్యలతో ఉద్యోగం మానేశారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే దురాలోచనతో రెండో నిందితుడు షేక్ జిలానీతో కలిసి బాడుగకు కార్లు అద్దెకు తీసుకున్నారు. రోజుకు అద్దె రూ.1,500లు చెల్లించగా.. షేక్ జిలానీ రూ.500 మిగుల్చుకుని రూ.1000 యాజమానులకు మూడు నెలల పాటు చెల్లించారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో వ్యాపారం బాగా జరగ్గా.. ఆ తర్వాత డీలా పడడంతో బాడుగలు చెల్లించలేకపోయారు. చివరకు ఇద్దరు నిందితులు కలిసి కార్లను రూ.47 లక్షలకు తాకట్టు పెట్టేశారు. ఈ మొత్తంలో బకాయి పడ్డ అద్దె చెల్లించడంతో పాటు మిగిలిన మొత్తాన్ని వాడుకున్నారు. ఆ తర్వాత నెలవారీ అద్దె ఇవ్వకపోగా.. చివరకు వాహనాలను సైతం యజమానులకు చూపించలేదు. ఒక బాధితుడు ఫిర్యాదుతో పలువురికి న్యాయం జరిగింది' ఎస్పీ తెలిపారు. కేసును డీఎస్పీ రమాకాంత్ ఆధ్వర్యంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్.ఐ. తయార్ హుస్సేన్, సిబ్బంది శేఖర్, విద్యాసాగర్, రమేష్, సునీల్‌లు కేసును ఛేదించినట్లు తెలిపారు. వీరిని అభినందించడంతో పాటు కార్లను యజమానులకు అప్పగించి నిందితులను రిమాండుకు పంపారు.

జిలెటిన్‌స్టిక్స్ విక్రేత ఎంపీ అవినాష్‌రెడ్డి పెదనాన్నే

ఎంపీ అవినాష్ వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: 'వేములలో వీఆర్‌ఏ హత్యకు వివాహేతర సంబంధమే కారణం. దీనిని మైనింగ్ హత్య అని ఎంపీ అవినాష్‌రెడ్డి అనడం దారుణం. ఎంపీ పెదనాన్న వై.ఎస్.ప్రతాప్‌రెడ్డికే గత 20 ఏళ్ల నుంచి జిలెటిన్ స్టిక్స్, ఇతర పేలుడు పదార్థాలు విక్రయించే అనుమతులున్నాయి... 2019లో వైకాపా అధికారంలోకి వచ్చాక వాటిని విచ్చలవిడిగా విక్రయించడంతోనే 2021లో కలసపాడులో ఏడుగురు మృతి చెందారు.' అని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మండిపడ్డారు. కడప జడ్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో శాంతిభద్రతల్లేవని ఎంపీ అవినాష్‌రెడ్డి వ్యాఖ్యానించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో అక్రమ మైనింగ్‌తో రూ.వందల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్పీ అన్బురాజన్... అవినాష్‌రెడ్డి ఇంట్లో పనిమనిషిలా వ్యవహరించారని విమర్శించారు. జిల్లాలో గతంలో పని చేసిన సీఐ అశోక్ రెడ్డి, ఎస్.ఐ.రాజరాజేశ్వరరెడ్డి, పులివెందుల సీఐలు రాజేశ్వరరెడ్డి, రాజు ఎన్నో దారుణాలకు పాల్పడ్డారని తెలిపారు. పులివెందులలో డేనీ, రవి మట్కా, జూదాన్ని నిర్వహిస్తున్నారని, ఎవరికైనా జూదంలో డబ్బులొస్తే పోలీసులను వారిళ్లకు పంపించి సొమ్మును స్వాధీనం చేసుకునేవారని ఆరోపించారు. పాడా ద్వారా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని, ఆ డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నించారు. పులివెందులలో పెద్దపెద్ద హోటళ్ల పేరిట బంధువులకు స్థలాలను విక్రయించారని విమర్శించారు. జిల్లాలో అక్రమ మైనింగ్ జరుగుతుంటే కలెక్టరు, ఎస్పీకి ఫిర్యాదు చేయవచ్చునని రాంగోపాల్‌రెడ్డి సూచించారు.

వేముల, వేంపల్లెలో అక్రమ మైనింగ్!

నిబంధనలకు విరుద్ధంగానే పేలుడు వస్తువుల సరఫరా : ఎస్పీ

ఈనాడు, కడప: పులివెందుల నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె మండలాల్లో అక్రమ మైనింగ్ విచ్చలవిడిగా సాగుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. గనుల తవ్వకాలకు వినియోగించే జిలెటెన్ స్టిక్స్, డిటోనేటర్లను అనుమతుల్లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అనుమతి పొందిన మ్యాగజైన్ నుంచి కాకుండా అక్రమ మార్గంలో సరఫరా చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఇటీవల వేముల మండలం కొత్తపల్లి వీఆర్‌ఏ నరసింహులును డిటోనేటర్లతో హత్య చేసిన ఘటనను తీవ్రంగా పరిగణించిన ఎస్పీ హత్య కేసు నిందితుడు బాబుకు డిటోనేటర్లు, జిలిటెన్‌స్టిక్స్ ఎక్కడ నుంచి వచ్చాయనే దానిపై ఆరా తీశారు. వేముల, వేంపల్లె మండలాల్లోని పలు అక్రమ మైనింగ్ నిర్వాహకులపై దాడులు చేసిన పోలీసులు.. ఓ మైనింగ్ యజమాని నుంచి 5 పెట్టెల్లోని డిటో నేటర్లు, మూడింటిలోని జిలిటెన్‌స్టిక్స్‌ను పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. కేవలం మైనింగ్ తవ్వకాలకు ఉపయోగించాల్సిన పేలుడు పదార్థాలను ఏళ్ల తరబడి అక్రమ మార్గంలో తీసుకొచ్చి వాడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఇటీవల జిల్లాలో ఏటీఎంలలో నగదు చోరీపై దర్యాప్తు ముమ్మరంగా సాగిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కేరళ రాష్ట్రంలో అనుమానితులపై నిఘా పెట్టామని, ఇటీవల పట్టుబడినవారిని విచారిస్తున్నట్లు వివరించారు. త్వరలోనే కేసును ఛేదిస్తామని ఎస్పీ వివరించారు.

దేవాలయ వ్యవస్థకు పూర్వవైభవం తేవాలి



కడప నగరంలో నిర్వహిస్తున్న శాంతి ర్యాలీ

మారుతీనగర్, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ మహాప్రసాదాన్ని అపవిత్రం చేయడం హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని, ఈ వ్యవహారంలో నిజాన్ని నిగ్గుతేల్చాలని శ్రీవిరజానంద స్వామిజీ, శ్రీశివదర్శనానంద సరస్వతీ మాతాజీ, శ్రీమాలిగి విద్యానిధి ఆచార్య స్వామిజీ డిమాండు చేశారు. విశ్వహిందూపరిషత్ జిల్లా సమితి పిలుపు మేరకు కడప ఎన్జీవో కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మహావీర్ కూడలి వరకు బుధవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. భారతీయ సనాతన ధర్మంలో దేవాలయ వ్యవస్థ మొదటిస్థానంలో ఉండేదని, ప్రస్తుతం అది రూపు కోల్పోతోందని, దానికి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. దీనిని ప్రభుత్వం నుంచి తప్పించి హిందూ పీఠాలకు అప్పగించాలని, పర్యవేక్షణకు స్వామీజీల ఆధ్వర్యంలో ధార్మిక పరిషత్తును ఏర్పాటు చేయాలని సూచించారు. ర్యాలీలో వీహెచ్‌పీ ప్రాంత ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ బెస్తవేముల రాంమహేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రామయ్యరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, చంటి, సంజీవరాజు, అమరనాథరెడ్డి, చిన్నక్క, దేవాలయ ధర్మ కర్తల మండలి సభ్యులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు, శ్రీవారి సేవకులు, మహిళలు, సత్సంగ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కోస్తేనే కాదు... సాగుచేసినా కన్నీరే!



ఉల్లి ధరలు ఆశాజనకంగా ఉన్నా దిగుబడి లేకపోవడంతో నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. కమలాపురం నియోజకవర్గంలో వందల ఎకరాల్లో ఉల్లిసాగు చేశారు. వర్షాలు కురవకపోవడంతో గడ్డ ఊరక దిగుబడి తగ్గింది. ఎకరాకు వంద క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, సగానికి పడిపోయినట్లు వాపోతున్నారు. మార్కెట్‌లో క్వింటా రూ.5వేలు ఉన్నప్పటికీ నాణ్యత, పరిమాణం లేకపోవడంతో రూ.2 వేలు పలుకుతున్నట్లు బయనపల్లి రైతు మధుసూధన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయనపల్లి వద్ద ఉల్లిగడ్డలను మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న కూలీలను చిత్రంలో చూడొచ్చు. - ఈనాడు, కడప

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దని ఆందోళన

మారుతీనగర్, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించడానికి మోదీ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు ఆరోపించారు. విశాఖ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కడప నగరంలోని వన్‌టౌన్ కూడలిలోని ఒకటో గాంధీబొమ్మ ఎదుట బుధవారం విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి, కార్మిక, రైతు సంఘాల నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని విభాగాలను మూసేసి, వీఆర్‌ఎస్, డిప్యుటేషన్ పేరుతో వేలాది మంది ఉద్యోగులను బయటకు పంపే ప్రక్రియ ప్రారంభించారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ తీసుకోవాలని, ట్రేడ్ యూనియన్లతో కూడిన అఖిలపక్ష ప్రతినిధులను ప్రధాని వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. అసెంబ్లీలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని కోరారు. కడప ఉక్కుపరిశ్రమ పనులు ప్రారంభించాలని డిమాండు చేశారు. వీరికి సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి తదితరులు మద్దతు తెలిపారు.




ఒకటో గాంధీబొమ్మ ఎదుట నిరసన దీక్ష చేపట్టిన విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ సమితి, కార్మిక, రైతు సంఘాల నాయకులు

చీనీ... నష్టం తెస్తోందని!

- గిట్టుబాటు ధరల్లేకపోవడం, తెగుళ్లతో చెట్ల తొలగింపు
- రెండేళ్లలో 4 వేల ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గుముఖం

–న్యూస్‌టుడే, పులివెందుల (లింగాల)

జిల్లాలో గత రెండేళ్లుగా చీనీ పంటకు గిట్టుబాటు ధరల్లేకపోవడంతో పాటు వేరుకుళ్లు చుట్టిముట్టి నిలువునా ఎండిపోతుండటంతో రైతులు చెట్లను తొలగించి ప్రత్యాన్మాయ పంటలు సాగు చేస్తున్నారు. దసరా సమయంలో మాత్రమే చీనీకి ధరలుంటాయి. ఆ తరువాత టన్ను రూ.25 వేలకు మించి పలకడం లేదు. జిల్లాలో రెండేళ్ల కిందట 67 వేల ఎకరాల్లో సాగవ్వగా, ఈ ఏడాది 63 వేల ఎకరాల్లోనే సాగైనట్లు ఉద్యానవనశాఖాధికారులు చెబుతున్నారు. అరటి టన్ను రూ.10 వేల ధర ఉన్నా గిట్టుబాటవుతుండటంతో చీనీ చెట్లు తొలగించి ఈ పంట సాగువైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. చీనీ పంట తొలగింపునకు ఇది కూడా ఒక కారణమని అధికారులు చెబుతున్నారు.




యంత్రంతో చీనీ చెట్ల తొలగింపు

వేరుకుళ్లు సోకి...

జిల్లాలో అత్యధిక శాతం మంది రైతులు జంబేరి వేరుమూలంపై అంటుకట్టిన చీనీ సాగు చేస్తున్నారు. చీనీ చెట్టు ఎకరాకు 6 టన్నుల దిగుబడి వస్తుంది. పంట జీవితకాలం 25 ఏళ్లు. 10 ఏళ్ల తర్వాత తెగుళ్లు సోకుతున్నాయి. చీనీకి వేరుకుళ్లు, పొలుసు పురుగు, బంక తెగుళ్లు ఆశిస్తున్నాయి. వేసవిలో వేరుకుళ్లు తెగుళ్లు ఎక్కువగా ఆశిస్తున్నాయి. ఈ సమయంలో కాయలు తెంపి సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉండగా తప్పనిసరి పరిస్థితుల్లో తొలగించాల్సి వస్తోంది. దిగుబడులొచ్చే సమయంలో పదుల సంఖ్యలో చెట్లు ఎండిపోతుండడంతో ఆ స్థానంలో తిరిగి మొక్కలు నాటినా దిగుబడులు వచ్చేందుకు ఐదేళ్ల సమయం పడుతోంది. దీంతో రైతులు యంత్రాలతో తోటలను తొలగిస్తున్నారు.

సూట్ పేరుతో మోసం


తెగుళ్లతో ఎండిపోయిన చెట్లు

వ్యాపారులు తోటల వద్దకే వచ్చి చీనీ దిగుబడులు కొనుగోలు పేరిట రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. రవాణాలో చీనీ పాడవుతుందన్న సాకుతో 10 టన్నులు చీనీ దిగుబడులకు సూట్ పేరుతో 2 టన్నుల దిగుబడులను ఉచితంగా వ్యాపారులకు రైతులివ్వాలి. వ్యాపారులు కూడా నష్టం వచ్చిందన్న సాకుతో కొనుగోలు చేసిన చీనీ దిగుబడుల సొమ్ము రైతులకు పూర్తి స్థాయిలో ఇవ్వడం లేదు. దిల్లీ, కోల్‌కత్తా, ముంబయి, బెంగళూరు, చెన్నై తదితర నగరాలకు ఇటీవల ఎగుమతులు తగ్గడంతో ధరలు పడిపోయాయి. గతేడాది, ఈ ఏడాది టన్ను రూ.25 వేలకు మించలేదు. రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. గిట్టుబాటు ధరల్లేకపోవడంతో రైతులు తోటలను తొలగిస్తున్నారు.

నాలుగెకరాల్లో తొలగించాం

ఈ ఏడాది మేలో తెగుళ్ల బారిన పడడంతో నాలుగెకరాల్లో చీనీ తోటలను తొలగించి అరటి సాగు చేశాను. దిగుబడులు బాగా ఉన్నప్పుడు ధర ఉండటం లేదు. ధర ఉన్న సమయంలో దిగుబడులు ఉండడంలేదు. ఒకప్పుడు బంగారు పంటగా విలసిల్లిన చీనీ రైతుల ఆదరణ కోల్పోతోంది. - భాస్కరరెడ్డి, చీనీ రైతు, బోనాల

సస్యరక్షణ చర్యలు చేపడితే ఫలితం

వేసవిలో చీనీకి వేరుకుళ్లు ఆశించి చెట్లు ఎండిపోతుండడం వాస్తవమే. సస్యరక్షణ చర్యలు చేపడితే నివారించడం కష్టం కాదు. చెట్టు వాడుముఖం పట్టగానే చెట్టు నుంచి కాయలు తెంపి సస్యరక్షణ చర్యలు చేపడితే ఫలితం ఉంటుంది. చీనీ పంట తొలగించి అరటి పంట సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. రైతుల్లో మార్పు తీసుకువస్తాం. - సుభాషిణి, జిల్లా ఉద్యాన అధికారిణి

కాలువలో బయటపడిన బాలుడి మృతదేహం

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు పట్టణం మీదుగా ప్రవహించే కేసీ కాలువలో భాగమైన కొండపేట కాలువలో గల్లంతైన తొమ్మిదేళ్ల బాలుడు షేక్ రఫీ మృతదేహం బుధవారం బయటపడింది. మంగళవారం షేక్ రఫీతో పాటు షేక్ యాసిన్ కాలువలో గల్లంతైన విషయం తెలిసిందే. అదే రోజు రాత్రి యాసిన్ మృతదేహం లభ్యం కాగా బుధవారం రఫీ మృతదేహం శాంతినగర్ వద్ద కాలువలో కంపచెట్టును ఆనుకొని ఉండగా గుర్తించి వెలికి తీశారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రుటితో తప్పిన ప్రమాదం

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే : పట్టణ శివార్లలోని కదిరివారిపల్లె క్రాస్‌రోడ్డు సమీపంలో బుధవారం నాపరాళ్ల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీ టైరు పగిలిపోవడంతో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. నిడిజివ్వి గనులలో నుంచి రాళ్లలోడుతో వస్తున్న ట్రాక్టరు ట్రాలీ టైరు ఒక్కసారిగా పగిలిపోయింది. దీంతో ట్రాక్టర్‌లోని రాళ్లు రోడ్డుపై పడిపోయాయి. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.


రోడ్డుపై పడిపోయిన నాపరాళ్లు

అక్రమంగా గుడిసెలు వేశారని ఆవేదన

బద్వేలు, న్యూస్‌టుడే : తన భూమిలో సీపీఐ నాయకులు అక్రమంగా గుడిసెలు వేయించారని తెదేపా నాయకుడు రామచంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బద్వేలులోని తెదేపా కార్యాలయంలో బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తనపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. తాను అక్రమాలకు పాల్పడినట్లు రుజువు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటానని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రాజుపాళెం,న్యూస్‌టుడే : మండలంలోని వెంగాళాయపల్లె నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును పోలీసులు సీజ్ చేశారు. దేవగుడికి చెందిన మునీంద్ర అనే వ్యక్తి అక్రమంగా ఇసుక తరలిస్తున్నాడనే సమాచారంతో దాడి చేసి ట్రాక్టరును పట్టుకున్నామన్నారు.

చాగలమర్రి : నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణం నుంచి ఆళ్లగడ్డ వైపు వెళ్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమేష్‌రెడ్డి బుధవారం తెలిపారు. ప్రొద్దుటూరు నుంచి చాగలమర్రి మీదుగా ఆళ్లగడ్డ వైపు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గుర్తించి స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

దసరా ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు

దసరా ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆర్యవైశ్య సభ ప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేశారు. వేడుకల కోసం ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. ముఖద్వారాలను ప్రత్యేకంగా అలంకరించి రంగురంగుల విద్యుద్దీపాలు అమర్చారు. గురువారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. - న్యూస్‌టుడే బృందం


ప్రొద్దుటూరు అమ్మవారిశాల వద్ద విద్యుద్దీపాలంకరణ


ప్రొద్దుటూరులో ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న చెన్నకేశవస్వామి ఆలయ ఉత్సవ కమిటీ నాయకులు



మైదుకూరు : అమ్మవారిశాల లోపల అలంకరణ... విద్యుత్తుదీపాల వెలుగులో దేవతామూర్తులు


దీపకాంతులతో కళకళలాడుతున్న కన్యతీర్థం


ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ, భాజపా నాయకులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

బద్వేలు, గోపవరం న్యూస్‌టుడే : తిరుమల లడ్డును అపవిత్రం చేసిన వారిని కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బద్వేలు ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం వీహెచ్‌పీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బాజాపా నాయకులు బొజ్జా రోషన్న, రామకోటేశ్వరా, ఈశ్వరయ్య తదితరులు మాట్లాడుతూ.. ఆలయాల్లో పని చేస్తున్న ఇతర మతాల వారిని వెంటనే తొలగించాలని కోరారు. అంతకుముందు వీరు చేపట్టిన ర్యాలీ పోరుమామిళ్ల వీధి నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా కొనసాగింది. అనంతరం నెల్లూరు రోడ్డులోని శ్రీవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రాయశ్చిత్త దీక్షను ప్రతి పల్లెకు తీసుకెళతాం

జమ్మలమడుగు : సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షను పల్లెపల్లెకు తీసుకెళతామని జనసేన పార్టీ కోఆర్డినేటర్ నల్లిశెట్టి నాగార్జున తెలిపారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నారాపుర వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నగర సంకీర్తన కార్యక్రమం చేపట్టారు. మహిళల కోలాటంతో అంబా భవానీ, ఆంజనేయస్వామి ఆలయం, అమ్మవారిశాల మీదుగా ర్యాలీ నిర్వహించారు. జనసేన నాయకులు గురుకుమార్, మేడికుర్తి ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, ధర్మల్ సుబ్బు, కిరణ్ రాయల్ పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు గాంధీపార్కులో మహాత్ముడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బాధ్య కమిషనర్, డీఈ షేక్‌దస్తగిరి, పురపాలక సిబ్బంది


జమ్మలమడుగు పాత బస్టాండులోని గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, నాయకులు


బద్వేలు కోర్టు ఆవరణను శుభ్రం చేస్తున్న న్యాయమూర్తి పద్మశ్రీ, కమిషనర్ నరసింహారెడ్డి

జాతిపిత... స్ఫూర్తి ప్రదాత

జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని బుధవారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాలలో ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంతో ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. - న్యూస్‌టుడే బృందం


మైదుకూరులోని పురపాలక కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న పురపాలక ఛైర్మన్ మాచనూరు చంద్ర

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే : స్థానిక కొత్తపల్లె పంచాయతీ పరిధిలో గత నెల 17 నుంచి ఈ నెల 2 వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా మెరుగైన పారిశుద్ధ్య సేవలందించిన కార్మికులను బుధవారం సర్పంచి కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, కార్యదర్శి నరసింహులు పూలమాలలతో సత్కరించారు. స్థానిక కొత్తపల్లె గ్రామ సచివాలయ ఆవరణలో వీరిని సత్కరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన సర్పంచి శివచంద్రారెడ్డి, తదితరులు

సీఎం సహాయనిధికి రూ.లక్ష అందజేత

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధికి ప్రొద్దుటూరుకు చెందిన వ్యాపార వేత్త గంగిశెట్టి అభినయ్ కుటుంబం రూ.లక్ష వితరణగా ఇచ్చింది. ఈ మేరకు చెక్కును తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి. కడప ఎమ్మెల్యే మాధవిలకు బుధవారం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దాన గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు.


తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవిలకు చెక్కు అందజేస్తున్న దాతలు


నిరసనలో పాల్గొన్న డీవైఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు

విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయొద్దని నిరసన

బద్వేలు, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ బద్వేలు పట్టణంలో బుధవారం డీవైఎఫ్ఐ నాయకులు ధర్నా నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని మాట్లాడుతూ.. 32 మంది బలిదానంతో విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పాటైందని గుర్తు చేశారు. ప్రైవేటుపరం చేయడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. విభజన చట్టం అమలులో భాగంగా కడపలో ఉక్కు పరిశ్రమను స్థాపించి నిరుద్యోగ యవతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసులు తదితరులు ప్రసంగించారు.

జమ్మలమడుగు : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపి జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండు చేశారు. బుధవారం స్థానిక ఎన్‌జీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ప్రారంభం

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే : బద్వేలు మండలంలోని తిరువెంగళాపురంలో బుధవారం చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రత్యేకాధికారి సూర్యనారాయణరెడ్డి, సర్పంచి నరసింహారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో చెత్తను సేకరించి ఈ కేంద్రంలో ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించి సంపద సృష్టిస్తామన్నారు.

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

వసతిగృహంలో సరకుల విక్రయంపై విచారణ

కాశినాయన, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని నరసాపురం ఎస్సీ బాలుర వసతి గృహంలోని సరకులను బుధవారం అక్కడి ఉద్యోగులు అక్రమంగా విక్రయిస్తూ స్థానికులకు పట్టుపడ్డారు. వసతిగృహ అధికారి పర్యవేక్షణ లేకపోవడం, కిందిస్థాయి ఉద్యోగులు స్థానికులు కావడంతో వారి ఆగడాలు మితిమీరిపోయాయి. బుధవారం స్థానిక బియ్యం వ్యాపారి వసతి గృహం నుంచి బియ్యం తీసుకెళ్లడాన్ని గుర్తించిన స్థానికులు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. ఏఎస్‌డబ్ల్యూవో రామయ్య హుటాహుటిన అక్కడికి వచ్చి విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వసతిగృహం నుంచి యల్లయ్య అనే ఉద్యోగి జొన్నల బస్తా పంపించారని పేర్కొన్నారు. వసతి గృహంలో జొన్నలు ఎందుకు ఉంచారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

అగస్త్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు పట్టణం న్యూస్‌టుడే : పట్టణంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, సహస్రనామ భస్మార్చన, హారతి, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రఘురామిరెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



కలుషిత జలం... ఆసుపత్రులకు జనం!

జమ్మలమడుగు, న్యూస్‌టుడే : నగర పంచాయతీ పరిధి 10, 11 వార్డుల్లోని కన్నెలూరు, నేతాజీ నగర్‌లో కలుషిత నీరు తాగి బుధవారం సుమారు 30 మంది అస్వస్థతకు గురయ్యారు. మూడు రోజులుగా ఇదే సమస్య ఉందని బాధితులు వాపోతున్నారు. సమస్య తీవ్రం కావడంతో వాంతులు, విరేచనాలతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరారు. కలుషిత నీరు తాగడం వల్లే ఈ సమస్యకు కారణమని బాధితులకు చికిత్స చేస్తున్న ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యుడు చెప్పడం గమనార్హం. ఈ ప్రాంత ప్రజలకు పెన్నానది నుంచి నేరుగా ట్యాంకుకు నీటిని పంపింగ్ చేస్తారని సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఇలా చాలా మంది వాంతులు, విరేచనాలకు గురికావల్సి వచ్చిందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి విషయం తెలియడంతో వైద్యులతో మాట్లాడి ఆరా తీశారు. బాధితులను ఫోన్‌లో పరామర్శించారు. తన సొంత ఖర్చుతో అందరికీ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.



జమ్మలమడుగులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రెండు రోజులుగా ఇబ్బంది పడుతున్నా

మేము నేతాజీ నగర్‌లో నివాసం ఉంటున్నాం. నీటి కాలుష్యంతో వాంతులు ఎక్కువగా అవుతుంటే ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాను. రెండు రోజులుగా చికిత్స తీసుకుంటున్నా ఇంకా నీరసంగానే ఉంది. స్వచ్ఛమైన నీరు అందించాలి. **- ఓబులమ్మ, బాధితురాలు నేతాజీనగర్, జమ్మలమడుగు**

అయిదుగురికి వాంతులు, విరేచనాలు

మా కుటుంబంలో అయిదుగురు సభ్యులుంటే అందరూ వాంతులు, విరేచనాలతో మూడు రోజులుగా బాధపడుతున్నాం. నాకు ఆరు నెలల బాబు ఉన్నాడు అతనికి ఇదే సమస్య ఉంది. దుర్వాసనతో కూడిన నీళ్లు తాగడం వల్లే ఇలా ఇబ్బంది పడుతున్నాం. **- శివకుమారి, బాధితురాలు, జమ్మలమడుగు**

అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం

కన్నెలూరు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటినే అందిస్తున్నాం. లీకేజీలు సైతం ఎక్కడా లేవు. నీటి కలుషితం జరగడానికి కారణాలు తెలుసుకుని పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తాం. **- వెంకటరామిరెడ్డి, కమిషనర్, జమ్మలమడుగు నగర పంచాయతీ**

ఎగ్జిబిషన్‌లో అధిక రుసుములు వసూలు సహించబోం

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే : దసరా నవరాత్రుల సందర్భంగా ప్రొద్దుటూరులో ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌లో అధిక రుసుములు వసూలు చేస్తే సహించబోమని తెదేపా నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పురపాలక సంఘం గెజిట్ ప్రకారం ధరలు అందుబాటులో ఉంచాలన్నారు. గతంలో వైకాపా ప్రభుత్వం ఎగ్జిబిషన్ పేరుతో ప్రజలను దోపిడీ చేస్తుంటే తాను పోరాడానని గుర్తు చేశారు. అధిక ధరలు నియంత్రించేందుకు పురపాలక కమిషనర్ చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్డీయే ప్రభుత్వంలో ఎలాంటి అవినీతి, దోపిడీకి తావులేదని పేర్కొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

ప్రొద్దుటూరు నేరవార్తలు: రద్దీ ప్రాంతాల్లో నిలిపిన ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు రెండో పట్టణ ఠాణా సీఐ యుగంధర్ తెలిపారు. స్థానిక మడూరు రోడ్డులోని ప్రకాష్‌నగర్ క్రాస్ రోడ్డు వద్ద బ్రహ్మంగారిమఠం మండలానికి చెందిన సోమిరెడ్డిపల్లి లాజరయ్య అలియాస్ ఓబులేసును అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. ప్రొద్దుటూరు రెండో ఠాణా, గ్రామీణ, మూడో ఠాణాలతో పాటు చాపాడు పరిధిలో ద్విచక్రవాహనాలు చోరీ చేసినట్లు గుర్తించారు. వాటిని బెంగళూరుకు తీసుకెళ్లి విక్రయించాలన్న ఉద్దేశంతో నిందితుడి ఇంటి సమీపంలోని ముళ్లపొదల్లో దాచి ఉంచాడన్నారు. 10 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులకు అండగా నిలుస్తాం



ఉపాధ్యాయునికి సన్మానిస్తున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, అప్సా నాయకులు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో పాటు ఆ సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(అప్సా) ఆధ్వర్యంలో ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 120 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ తల్లికి వందనం పథకం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వర్తిస్తుందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు, ప్రైవేటు పాఠశాలల్లో చదివే అర్హులైన వారికి అందజేస్తామని స్పష్టం చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలు చాలా మందికి ఉపాధి కల్పిస్తూ రాష్ట్ర నిర్మాణంలో గొప్ప పాత్ర పోషిస్తున్నాయన్నారు. అప్సా జిల్లా అధ్యక్షుడు గంగయ్య, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ఆడిటోరియం నిర్మాణానికి చర్యలు


వేంపల్లె, న్యూస్‌టుడే : ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఆడిటోరియం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ట్రిపుల్‌ఐటీలో బుధవారం జరిగిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. అసంపూర్తిగా నిలిచిన ఆడిటోరియం పనులను ఎమ్మెల్సీ పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. నిలిచిన ఆడిటోరియం, ఇతర సమస్యలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ తొమ్మిదో విభాగం ఆధ్వర్యంలో ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమార్ స్వామి గుప్త, పరిపాలనా అధికారి డాక్టరు రవికుమార్, అకడమిక్ డీన్లు రమేష్ కైలాశ్, వెంకటేశ్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు దీప్తి, బొజ్జా అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీనీ... నష్టం తెస్తోందని!

- గిట్టుబాటు ధరలేకపోవడం, తెగుళ్లతో చెట్ల తొలగింపు
- రెండేళ్లలో 4 వేల ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గుముఖం

-న్యూస్‌టుడే, పులివెందుల (లింగాల)

జిల్లాలో గత రెండేళ్లుగా చీనీ పంటకు గిట్టుబాటు ధరలేకపోవడంతో పాటు వేరుకుళ్లు సోకి చెట్లు నిలువునా ఎండిపోతుండటంతో రైతులు చెట్లను తొలగించి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తున్నారు. దిగుబడి సమయంలో మాత్రమే చీనీకి ధరలుంటాయి. ఆ తరువాత టన్ను రూ.25 వేలకు మించి పలకడం లేదు. జిల్లాలో రెండేళ్ల కిందట 67 వేల ఎకరాల్లో సాగవ్వగా, ఈ ఏడాది 63 వేల ఎకరాల్లో సాగవుతున్నట్లు ఉద్యానవనశాఖాధికారులు చెబుతున్నారు. అరటి టన్ను రూ.10 వేల ధర ఉన్నా గిట్టుబాటవుతుండటంతో చీనీ చెట్లు తొలగించి ఈ పంట సాగువైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. చీనీ పంట తొలగింపునకు ఇది కూడా ఒక కారణమని అధికారులు చెబుతున్నారు.



సూట్ పేరుతో మోసం



తెగుళ్లతో ఎండిపోయిన చెట్లు

వ్యాపారులు తోటల వద్దకే వచ్చి చీనీ దిగుబడులు కొనుగోలు చేసేవారు. రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. రవాణాలో చీనీ పాడవుతుందన్న సాకుతో 10 టన్నుల చీనీ దిగుబడులకు సూట్ పేరుతో 2 టన్నుల దిగుబడులను ఉచితంగా వ్యాపారులకు రైతులివ్వాలి. వ్యాపారులు కూడా నష్టం వచ్చిందన్న సాకుతో కొనుగోలు చేసిన చీనీ దిగుబడుల సొమ్ము రైతులకు పూర్తి స్థాయిలో ఇవ్వడం లేదు. ఢిల్లీ, కోల్‌కత్తా, ముంబయి, బెంగళూరు, చెన్నై తదితర నగరాలకు ఇక్కడి నుంచి ఎగుమతులు తగ్గడంతో ధరలు పడిపోయాయి. గతేడాది, ఈ ఏడాది టన్ను రూ.25 వేలకు మించలేదు. రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. గిట్టుబాటు ధరలేకపోవడంతో చెట్లను తొలగిస్తున్నారు.



యంత్రంతో చీనీ చెట్ల తొలగింపు

వేరుకుళ్లు సోకి..

జిల్లాలో అత్యధిక శాతం మంది రైతులు బంజేరి వేరుమూలంపై అంటుకట్టిన చీనీ సాగు చేస్తున్నారు. చీనీ చెట్టు ఎకరాకు 6 టన్నుల దిగుబడి వస్తుంది. పంట జీవితకాలం 25 ఏళ్లు. 10 ఏళ్ల తర్వాత తెగుళ్లు సోకుతున్నాయి. చీనీకి వేరుకుళ్లు, పొలుసు పురుగు, బంక తెగుళ్లు ఆశిస్తున్నాయి. వేసవిలో వేరుకుళ్ల తెగుళ్లు ఎక్కువగా ఆశిస్తున్నాయి. ఈ సమయంలో కాయలు తెంపి సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సి ఉండగా తప్పనిసరి పరిస్థితుల్లో తొలగించాల్సి వస్తోంది. దిగుబడులొచ్చే సమయంలో పదుల సంఖ్యలో చెట్లు ఎండిపోతుండడంతో ఆ స్థానంలో తిరిగి మొక్కలు నాటినా దిగుబడులు వచ్చేందుకు ఐదేళ్ల సమయం పడుతోంది. దీంతో రైతులు యంత్రాలతో తోటలను తొలగిస్తున్నారు.

నాలుగెకరాల్లో తొలగించాం

ఈ ఏడాది మేలో తెగుళ్లు బారిన పడడంతో నాలుగెకరాల్లో చీనీ తోటలను తొలగించి అరటి సాగు చేశాను. దిగుబడులు బాగా ఉన్నప్పుడు ధర ఉండటం లేదు. ధర ఉన్న సమయంలో దిగుబడులు ఉండడంలేదు. ఒకప్పుడు బంగారు పంటగా విలసిల్లిన చీనీ రైతుల ఆదరణ కోల్పోతోంది.

- భాస్కరరెడ్డి, చీనీ రైతు, బోనాల

సస్యరక్షణ చర్యలు చేపడితే ఫలితం

వేసవిలో చీనీకి వేరుకుళ్లు ఆశించి చెట్టు ఎండిపోతుండడం వాస్తవమే. సస్యరక్షణ చర్యలు చేపడితే నివారించడం కష్టం కాదు. చెట్టు పూత ముఖం పట్టగానే చెట్టు నుంచి కాయలు తెంపి సస్యరక్షణ చర్యలు చేపడితే ఫలితం ఉంటుంది. చీనీ పంట తొలగించి అరటి పంట సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. రైతుల్లో మార్పు తీసుకువస్తాం.

- సుభాషిణి, జిల్లా ఉద్యాన అధికారిణి

తప్పిన పెనుప్రమాదం

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప ఒకటో పట్టణ రాణా పరిధిలో బుధవారం ఓ ఐస్‌క్రీమ్ దుకాణంలో పెను ప్రమాదం తప్పింది. నగరంలో ఒకటో గాంధీ విగ్రహం సమీపంలోని ఐస్‌క్రీమ్ దుకాణం బయట వివిధ రకాల ఫాస్ట్‌ఫుడ్స్ తయారు చేసి విక్రయిస్తున్నారు. అక్కడ ఉన్న గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ ఒత్తిడితో ఒక్కసారిగా ఊడిపోయి పైకి లేచింది. ఈ ప్రమాదంలో దుకాణ అద్దాలు పగిలిపోయాయి. వంద మీటర్ల వరకు పెద్ద శబ్దం వచ్చింది. దుకాణంలో ఐస్‌క్రీమ్ తింటున్న వారు, చుట్టుపక్కల వారు బయటకు పరుగులు తీశారు. మంటలు వ్యాపించకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ద్విచక్రవాహనాలకు నిప్పంటించిన దుండగులు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప మాసాపేటకు చెందిన వరప్రసాద్ తన ఇంటి ఆవరణలో నిలిపిన రెండు ద్విచక్రవాహనాలకు మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ ఘటనలో సుమారు రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లింది. బాధితుడిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మెకానిక్‌కు తీవ్ర గాయాలు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప ఆర్టీసీ గ్యారేజీలో ప్రమాదవశాత్తూ మెకానిక్‌కు తీవ్రగాయాలయ్యాయి. అంకాలయ్య అనే మెకానిక్ బుధవారం బస్సుకు సంబంధించి బెల్టు మరమ్మతులు చేస్తున్నారు. ఇది గమనించని మరో మెకానిక్ బస్సును స్టార్ట్ చేయడంతో అంకాలయ్య చేతి వేళ్లు బెల్టులో పడి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతడిని ఆర్టీసీ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స అందించారు. అక్కడ నుంచి శస్త్రచికిత్స కోసం నగరంలోని ఎంఎం ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి, ఆర్టీసీ సీనియర్ వైద్యులు శ్రీకాంత్‌రెడ్డిలు బాధితుడిని పరామర్శించారు.

చేనేత, జౌళిశాఖ అధికారిగా పిచ్చేశ్వరరావు



కడప గ్రామీణ, న్యూస్‌టుడే: చేనేత, జౌళిశాఖ జిల్లా అధికారిగా బి.పిచ్చేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఆయన తిరుపతి నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన నాగరాజారావు కర్నూలుకు బదిలీ అయ్యారు.

మహిళ ఆత్మహత్య

చక్రాయపేట, న్యూస్‌టుడే : మండల పరిధిలోని కొండవాండ్లపల్లెకు చెందిన రమాదేవి (30) కడుపు నొప్పి తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఇడుపులపాయ బాధ్య ఎస్సై రంగారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు రమాదేవి గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి తన నివాసంలో కుటుంబసభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె భర్త ప్రసాద్ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

4న కడపలో ఉద్యోగ మేళా

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: కడప నగరంలోని కాగితాలపెంటలో ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 4న శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ఏడీ కె.రత్నబాబు ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరుకావాలని సూచించారు. ఐసీఐసీఐ బ్యాంక్, అభి గ్రీన్ టెక్నాలజీ, రిలయన్స్ తదితర కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హత పత్రాలు ఆధార్, రెండు ఫొటోలు తీసుకురావాలని తెలిపారు.

పెన్నాలో మునిగి బాలుడి మృతి



ఇస్మాయిల్ (పాత చిత్రం)

సిద్దవటం, న్యూస్‌టుడే : ఆరేళ్ల బాలుడు పెన్నాలో మునిగి మృతి చెందిన సంఘటన బుధవారం సిద్దవటం వద్ద చోటుచేసుకుంది. అన్నమయ్య జిల్లా పుల్లంపేట పట్టణంలోని జెండామాను వీధికి జాకీర్, జరీనాకు అయిదుగురు సంతానం. వారిలో చివరి కుమారుడైన ఇస్మాయిల్ తన బాబాయి కుటుంబంతో విహారయాత్రకు సిద్దవటం వచ్చాడు. మట్లిరాజుల కోటను సందర్శించిన అనంతరం వారు పెన్నానది వద్దకు వచ్చారు. పిల్లలందరూ లోలెవెల్ కాజ్‌వే పక్కన ఉన్న పెన్నాలోని ఇసుక మేటలపై ఆడుకుంటుండగా ఇస్మాయిల్ అదుపు తప్పి నదిలోకి జారి మునిగిపోయాడు. గమనించిన బంధువు, మరో ఇద్దరు యువకులు అతన్ని కాపాడేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. సమాచారం తెలుసుకున్న ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని, గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టగా, కొంత సమయానికి బాలుడి మృతదేహం బయటపడింది. చిన్నారి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు విలపించారు.

భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం / ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు, ఎస్.ఐ.లు ప్రవీణ్‌కుమార్, రంగారావు

వేముల, న్యూస్‌టుడే : అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను వినియోగిస్తున్న ఇద్దరిని బుధవారం అరెస్టు చేసినట్లు ఆర్కే వ్యాలీ సీఐ వి.నాగరాజు తెలిపారు. వేముల పోలీసుస్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. వేముల ప్రాంతంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ముగ్గురాయి తవ్వకాలకు పేలుడు పదార్థాలు వినియోగిస్తున్నారన్న సమాచారం మేరకు వేముల, వేంపల్లె ఎస్సైలు పి. ప్రవీణ్‌కుమార్, వి.రంగారావుతోపాటు సిబ్బందితో కలిసి దాడులు చేపట్టామన్నారు. ఈ దాడుల్లో వేముల రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 606-పిలో నిర్వహిస్తున్న గనివద్దకు వెళ్లగా అక్కడ అనుమానాస్పదంగా సంచరిస్తున్న వేములకు చెందిన వంకదార కిరణ్‌కుమార్, చింతలజూటూరుకు చెందిన అన్నారెడ్డి బాలగంగిరెడ్డిని అదుపులోకి తీసుకుని సోదా చేయగా పేలుడు పదార్థాలు బయటపడ్డాయని తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 539 జిలిటిన్‌స్టిక్స్, 150 ఎలక్ట్రో డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సామూహిక పిండ ప్రదానానికి స్పందన

వల్లూరు, న్యూస్‌టుడే : పవిత్ర పుణ్యక్షేత్రం పుష్పగిరి రుద్రపాదం ఆలయం వద్ద బుధవారం మహాలయ అమావాస్య సందర్భంగా దేవస్థాన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక పిండప్రదానం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లావాసులే కాక సుదూర ప్రాంతాలకు చెందిన వారు పితృదేవతలకు భక్తిశ్రద్ధలతో పిండప్రదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. నిర్వాహకులు కార్యక్రమానికి కావాల్సిన వస్తువులను అందించారు. అనంతరం భక్తులు రుద్రపాదం, చెన్నకేశవస్వామి, రాజేశ్వరిదేవిలను దర్శించుకుని పూజలు చేశారు. వేదపండితులు అఖిల్‌శర్మ, సుమంత్‌శర్మలు సూచనలు ఇస్తూ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.



సామూహిక పిండప్రదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

ఖైదీల సంక్షేమానికి కృషి: కలెక్టర్

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: ఖైదీల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని కలెక్టరు లోతేటి శివశంకర్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా కడప కేంద్రకారాగారంలో బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జైలు అధికారి రాజేశ్వరరావు అధ్యక్షత వహించారు. తొలుత గాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ తెలిసో తెలియకో తప్పులు చేసి జైలుకు వచ్చినంత మాత్రాన నిరుత్సాహానికి గురికావద్దన్నారు. నేరప్రవృత్తి, ద్వేషం పెంచుకోవద్దన్నారు. ఖైదీలు సత్‌ప్రవర్తనతో జీవించాలన్నారు. జైల్లో ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఖైదీలు మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. గంజాయి, మత్తు లాంటి పదార్థాల జోలికి వెళ్లవద్దన్నారు. విడుదల అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో రవిబాబు, సివిల్ సర్జన్ శ్రీనివాసరావు, మానసిక కౌన్సిలర్ సునీత, ఉప పర్యవేక్షణాధికారి జవహర్‌బాబు, రమేష్, వైద్యులు పుష్పలత తదితరులున్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే పోటీలు



చదరంగం పోటీల్లో ఉపాధ్యాయులు

కడప విద్య, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు క్రీడ, సాంస్కృతిక పోటీలు ఎంతగానో తోడ్పడతాయని డాక్టర్ ఓబుల్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాలలో బుధవారం యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా దివ్యాంగులకు పోటీలు నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెంమహేష్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం చెస్, క్యారమ్స్, షాట్‌పుట్, 100 మీటర్ల రన్నింగ్‌తో పాటు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ - ఉపాధ్యాయుల పాత్ర అనే అంశంపై వక్తృత్వం, సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై పోటీలను నిర్వహించామన్నారు. ఇక్కడి విజేతలకు ఈ నెల 4, 5, 6 తేదీలలో గుంటూరు లో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని చెప్పారు. ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎబినేజర్, యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, ఏజాస్అహ్మద్, రూతుఆరోగ్యమేరి, ప్రభాకర్, అంధ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పార్థసారథి, రాజా తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



అతిథుల నుంచి బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

కడప విద్య, న్యూస్‌టుడే : మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు చెకుముకి జిల్లాస్థాయి పరీక్ష అక్టోబరు 27న జరగనుందని జన విజ్ఞాన వేదిక (జవివే) రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్‌రాహుల్ తెలిపారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో బుధవారం మండల స్థాయి నుంచి జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులకు బహుమతుల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీరసుదర్శన్‌రెడ్డి, జవివే నాయకులు కిరణ్, గోవిందు, అరుణ, కామేశ్వరమ్మ, నరసింహ, సునీత తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి ఏపీటీఎఫ్ ఓక్ జూబ్లీ వేడుకలు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: విజయనగరంలో ఈ నెల 6 నుంచి 8 వరకు నిర్వహించే ఓక్ జూబ్లీ వేడుకలను విజయంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి అబ్దుల్లా పేర్కొన్నారు. బుధవారం జిల్లా ఎన్జీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ఏపీటీఎఫ్ ఏర్పాటు అయి 80 ఏళ్లు అయిన నేపథ్యంలో విజయనగరంలో వరుసగా మూడు రోజులు నిర్వహించే ఓక్‌జూబ్లీ వేడుకలతో పాటు 20వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలన్నారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు నాగభూషణం, జిల్లా కార్యదర్శి చెన్నారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి రూ.లక్ష అందజేత



తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవిలకి చెక్కు అందజేస్తున్న దాతలు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధికి ప్రొద్దుటూరుకు చెందిన వ్యాపార వేత్త గంగిశెట్టి అభినయ్ కుటుంబం రూ.లక్ష వితరణగా ఇచ్చింది. ఈ మేరకు చెక్కును తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి. కడప ఎమ్మెల్యే మాధవిలకు బుధవారం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దానగుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

కడప విద్య, న్యూస్‌టుడే : దసరా కానుకగా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో బుధవారం ఉమ్మడి కడప జిల్లా ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (పీఎస్టీయూ) కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగింది. పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ పదకొండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలన్నారు. పీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కలజమాల్‌రెడ్డి మాట్లాడుతూ 3వ తరగతి నుంచి సబ్జెక్టు ఉపాధ్యాయులు ఉండాలని, 3, 4, 5 తరగతులను హైస్కూల్స్ కి అనుబంధంగా ఉంచాలని, వీటిని తీసివేస్తే ఉద్యమిస్తామన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డన్న, మజహారుల్‌హక్, రామాంజనేయరెడ్డి, ఓబుల్‌రెడ్డి, సుబ్బారెడ్డి, షేక్‌జక్రియబాషా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

కడప క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలోని జయనగర్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి బాలబాలికల సబ్ జూనియర్స్ ఎంపికల పోటీలు ఉత్సాహంగా సాగాయి. సంఘం అధ్యక్షుడు ఎన్.సహదేవరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. పీడీలు కె.కృష్ణప్రసాద్, పి.సువర్ణ, బి.వెంకటసుబ్బమ్మ, సి.మంజునాథ, క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

బాలుర విభాగం: జీవీ.చరణ్, జి.హేమవెంకటతరుణ్, సి.యోగేంద్ర, జీవీ.కిరణ్, పి.గౌతమ్, ఎ.సంతోష్, వి.గంగకార్తీక్, పి.రామ్‌చరణ్, కె.జాఫర్, ఎస్ఎండీ గౌస్, జి.విజయ్, ఎస్‌కే.మౌలాలి. **బాలికల విభాగం:** ఎం.చంద్రమౌనిక, వి.అమృతవర్షిత, డి.సింధు, సి.బిందుమాధురి, డి.షర్మిల, పి.దుర్గ, ఎస్.ముస్కాన్, డి.తస్లీం, కె.లాస్య, ఎం.సాయిచైత్ర, పి.హర్షిత, బి.మౌనిక

రేపటి నుంచి అండర్-14 క్రికెట్ పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి 23వ తేదీ వరకు ఏసీఏ అండర్-14 పురుషుల రెండు రోజుల మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు అసోయేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌తో పాటు చిత్తూరు, కర్నూలు, విశాఖపట్నం, ప్రకాశం, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లా జట్లు పోటీపడతాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా జట్టును ప్రకటించారు.

కూటమి పాలనలో శాంతిభద్రతలు దారుణం

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే : కూటమి పాలనలో శాంతిభద్రతలు దారుణంగా క్షీణించాయని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం పులివెందులలో ఎంపీ మాట్లాడుతూ.. వేముల మండలం వి.కొత్తపల్లెలో వీఆర్‌ఏ నరసింహులును గిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లతో హత్య చేయడం దారుణమని తెలిపారు. ఈ ఘటన జిల్లాలో ప్రజలను ఆందోళనకు గురి చేసిందన్నారు. హత్య, గిలెటిన్ స్టిక్స్ వినియోగానికి అక్రమ మైనింగే కారణమని ఆరోపించారు. అక్రమ మైనింగ్ నిరోధానికి ఎస్పీ నుంచి ఇతర అన్ని శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని విమర్శించారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో వైకాపా కార్యకర్తలపై ఇష్టారాజ్యంగా దాడులు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని సూచించారు. పులివెందులలో ఇటీవల కాలంలో మట్కా, జూదం విచ్చలవిడిగా ఆడుతున్నారని, అందుకే ఇక్కడ నెల రోజుల వ్యవధిలో చోరీలు జరిగాయని తెలిపారు. మెడికల్ కౌన్సిల్ మంజూరు చేసిన సీట్లను వద్దని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించడం దారుణమన్నారు.

వీఆర్‌ఏల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: గ్రామ రెవెన్యూ సహాయకుల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎంపికైంది. ఏపీఆర్ఎస్ఏ జిల్లా కోశాధికారి రోనాల్డ్‌శ్యామ్యూల్‌రాజ్, వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య ఆధ్వర్యంలో రెవెన్యూభవనలో ప్రత్యేకసమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కిరణ్‌కుమార్, శంకరయ్య, ఉపాధ్యక్షుడిగా సతీష్, కోశాధికారిగా వెంకటసుబ్బయ్య, సహ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు మరో ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

అక్రమ ముగ్గురాయి గనులపై పోలీసుల దాడులు

వేముల, న్యూస్‌టుడే: మండలంలో అక్రమంగా ముగ్గురాయి తవ్వకాలు చేపడుతున్న గనులపై పోలీసులు దాడులను ముమ్మరం చేశారు. పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, ఆర్కే వ్యాలీ సీఐ నాగరాజు, వేముల, వేంపల్లె, ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, రంగారావు, బాంబుస్క్వాడ్ బృందం బుధవారం వేముల ప్రాంతంలోని గనులపై తనిఖీలు చేపట్టారు.

పైన పటారం... లోన లొటారం



జడ్పీ కార్యాలయం ఎదుట అధ్వానంగా పరిసరాలు



డీపీఆర్‌సీ కార్యాలయం వెనుక పెరిగిన పిచ్చిమొక్కలు, కంపచెట్లు

రూ.4.55 కోట్లతో జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు.. రూ.1.70 కోట్లతో కార్యాలయానికి మరమ్మతులు చేశారు. దీంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అంతా బాగానే ఉన్నా జడ్పీ ఆవరణ, పరిసరాలను మాత్రం అధ్వానంగా వదిలేశారు. ఇక్కడ పెద్దఎత్తున కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరగడంతో విషసర్పాలు తిరుగుతున్నాయి. కొన్నిసార్లు కార్యాలయాల్లోకి కూడా పాములు వస్తున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జడ్పీ భవనానికి మరమ్మతులు చేసే సమయంలో బీరువాలు, టేబుళ్లు, వాకిళ్లు, ఇతర ఫర్నిచర్ బయట పడేశారు. అవి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పాడైపోయాయి. వాటిని అలాగే ఉంచారు. రూ.కోట్లు ఖర్చు పెట్టి అభివృద్ధి చేసిన అధికారులు పరిసరాలను పట్టించుకోకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డికి సంప్రదించగా ప్రాధాన్యక్రమంలో జడ్పీ అభివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆవరణతో పాటు, పరిసర ప్రాంతాలను శుభ్రం చేయిస్తామని చెప్పారు. కొన్ని చోట్ల పార్కింగ్ టైల్స్‌ను ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

- న్యూస్‌టుడే, కడప ఏడురోడ్లు

సమస్యలు పరిష్కరించాలని వినతి

కడప విద్య, న్యూస్‌టుడే : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలల ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కడపలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ని కలిసి వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి తదితరులున్నారు.

కడప

•కడప •పులివెందుల •కమలాపురం

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

కమలాపురం, న్యూస్‌టుడే : పట్టణంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి దసరా ఉత్సవాలకు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారిశాలను రంగు రంగుల విద్యుత్తు దీపాలతో అలంకరించారు. చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు రాత్రి వేళల్లో వాసవీమాత వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారని ఆర్యవైశ్య సంఘం నాయకులు కోరారు. ఉత్సవాలకు తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిని బుధవారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి వెంకటరమణయ్య, ఉపాధ్యక్షుడు గాజులపల్లె శంకర్‌రావు, కోశాధికారి మాలేపాటి వెంకటమల్లికార్జున, ప్రతినిధులు కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు.



పూజలందుకుంటున్న కన్యకాపరమేశ్వరీ దేవి



పులివెందులలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి



కడపలో బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మాధవి



వల్లూరులో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

మహాత్ముని మార్గం... అనుసరణీయం

అహింసను మించిన ఆయుధం లేదని ప్రపంచానికి చాటి చెప్పిన మహాత్ముని జీవితం అందరికీ ఆదర్శమని, ఆయన మార్గంలో పయనించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతిని పురస్కరించుకొని కార్యాలయాలు, కళాశాలలు, వివిధ సంస్థల్లో వారి విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించారు.

- న్యూస్‌టుడే, బృందం



వేంపల్లెలో నివాళులర్పిస్తున్న సర్పంచి శీను, ఈవో సుబ్బారెడ్డి తదితరులు



కమలాపురంలో నివాళులర్పిస్తున్న తెదేపా నాయకులు



కడప ఐటీఐ కూడలి వద్ద గాంధీజీ జీవితంపై ఛాయాచిత్ర ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు



వైవీయూలో మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తున్న వీసీ, ప్రిన్సిపల్, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు, వాలంటీర్లు



పెన్షనర్ల కార్యాలయంలో

ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ఎన్‌జీవో కాలనీ (కడప), న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల ప్రత్యేక సంచికగా ఇంటాక్ రూపొందించిన మన చరిత వారసత్వ బులిటెన్‌ను బుధవారం కడప నగరంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరదేవి ఆలయంలో ఆవిష్కరించారు. జిల్లా చాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించండి

చెన్నూరు, న్యూస్‌టుడే: చెన్నూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచి వెంకట సుబ్బయ్య ఆధ్యక్షతన గ్రామ సభ ఏర్పాటు చేశారు. అధికారుల తీరుపై వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు మండిపడ్డారు. జాతీయ రహదారిలోని కొత్తరోడ్డుపై బస్సు షెల్టరు లేకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి నిలబడి ఉండాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. గ్రామంలో అపరిశుభ్రతతో విషజ్వరాలతో వ్యాధులకు గురవుతున్నా అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఆటోకు పోలీసు నంబరు తప్పనిసరి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో తిరిగే ప్రతి ఆటోకు పోలీసు నంబరు ఉండాల్సిందేనని, లేకుంటే జరిమానా విధిస్తామని కడప ట్రాఫిక్ సీఐ జావెద్ అన్నారు. కడప నగరంలోని వివిధ ఆటో యూనియన్ నాయకులకు బుధవారం ఠాణా ఆవరణలో కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసు నంబర్ల కోసం ఆటో యజమాని ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్సు, ఆధార్ జిరాక్స్ పత్రాలు అందజేయాలని సూచించారు.

ఫ్లెక్సీలు తొలగించడం అన్యాయం

కడప నగరపాలక, న్యూస్‌టుడే: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా కడప నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను నగరపాలక ప్రణాళికవిభాగం అధికారులు తొలగించడం అన్యాయమని వైకాపా కార్పొరేటర్లు షఫీ, షంషీర్ అక్బర్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ ఛైర్మన్ కరీముల్లా తదితరులు పేర్కొన్నారు. వారు బుధవారం వైకాపా జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ పండగల సందర్భంగా ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను తొలగించరాదని గతంలో పాలకవర్గం తీర్మానం చేసిందని తెలిపారు. దానిని అధికారులు బేఖాతరు చేయడం దారుణమని చెప్పారు.

ఆక్రమిత స్థలం స్వాధీనం

వేంపల్లె, న్యూస్‌టుడే : వేంపల్లెలోని ఆర్టీసీ బస్టాండు వెనుక వైపున ఉన్న వృషభాచలేశ్వర స్వామి ఆలయ స్థలం ఆక్రమణకు గురవ్వడంతో స్థానిక భాజపా, జనసేన నాయకులు గాలి హరిప్రసాద్, దొంతు సుమన్, తదితరులు దేవస్థాన ఈవో విశ్వనాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈవో సర్వే నంబరు 416లో ఉన్న రూ.కోట్ల విలువైన 70 సెంట్ల స్థలాన్ని సిబ్బందితో కలిసి వెళ్లి ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థలంలో ఉన్న చెత్తా చెదారాన్ని, నిర్మాణ వ్యర్థాలను తొలగించారు. పూర్తిస్థాయిలో సర్వే చేసి రక్షణ గోడ నిర్మిస్తామని ఈవో తెలిపారు.

భూవివాదం... ఇద్దరిపై దాడి

చక్రాయపేట, న్యూస్‌టుడే : మండల పరిధిలోని దేవరగుట్టపల్లెలో నివాసం ఉంటున్న వృద్ధ దంపతులు దాసరి వెంకటరమణ, నారయణమ్మలను అదే గ్రామానికి చెందిన దాసరి నాగేంద్ర, మరికొందరు దాడి చేసి గాయపరిచినట్లు చక్రాయపేట పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం బాధితుడు వెంకటరమణ మాట్లాడుతూ.. సుమారు 60 ఏళ్లుగా అనుభవంలో ఉన్న భూమిని అన్యాక్రాంతం చేసి ఇంటిపై దౌర్జన్యం చేశారని ఆరోపించారు. న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు ఎస్సై రంగారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ పోలీసు స్టేషన్ తనిఖీ

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటంలోని ఎక్సైజ్, ప్రొహిబిషన్ పోలీసు స్టేషన్‌ను బుధవారం ఆ శాఖ సూపరింటెండెంట్ రవికుమాం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సిద్దవటం, అట్లూరు, ఒంటిమిట్ట మండలాల పరిధిలో నాటు సారా, మత్తు పదార్థాలు, అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా నిఘా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. సీఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

బలిజ భవన్ నిర్మాణం చేపట్టాలని వినతి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: కడప నగరంలో బలిజభవన్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టిసారించి, నిధులు మంజూరు చేయించాలని కోరుతూ బలిజ సంక్షేమ సంఘం నేతలు తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డికి బుధవారం వినతి పత్రం అందించారు. కడపలోని శ్రీనివాసరెడ్డి నివాసంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, బలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపిశెట్టి నాగరాజు, మాజీ కౌన్సిలర్ బండిబాబు తదితరులు కలిసి బలిజభవన్ ఆవశ్యకతను వివరించారు. బలిజ సంఘం ప్రతినిధులు బండారు సత్యనారాయణ, వెంకటసుబ్బయ్య, మూర్తి, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న బలిజ సంఘం నేతలతో హరిప్రసాద్

గండివాటర్ వర్క్స్‌పై సమగ్ర విచారణ

అరవిందనగర్ ,నగరపాలక, న్యూస్‌టుడే: కడప నగరానికి నీరందించే గండివాటర్ వర్క్స్‌పై సమగ్ర విచారణ చేపట్టాలని కడప ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. ఆమె బుధవారం ఉదయం నగరపాలక సంస్థ కమిషనర్‌నందన్, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి గండి వాటర్ వర్క్స్ ప్రాంతాన్ని పరిశీలించారు. మోటార్ల పనితీరు, పైపుల గురించి ఆరాతీశారు. మోటార్లకు నెలకు రూ.8 లక్షల వరకు ఖర్చుపెట్టి మరమ్మతులు చేయిస్తున్నారే తప్ప కొత్తవి ఏర్పాటు చేయలేదని ఎమ్మెల్యే ఆరోపించారు. వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించారు.

✤ నగర వాసులకు ఆహ్లాదకర వాతావరణం అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. బుధవారం కడపలోని గాంధీనగర్ ఉన్నత పాఠశాల వద్ద గాంధీ ప్లాజాను ప్రారంభించారు. జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్, నగరపాలక కమిషనర్ నందన్ తదితరులున్నారు. నగరపాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బందిని సత్కరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆర్‌టీపీపీ అధికారులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు అధికారులు చట్టాలను ఉల్లంఘించి, ప్రభుత్వ ఉత్తర్వులను, కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ భూ నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించకుండా ఇతరులకు ఇచ్చారని ఈ అక్రమ నియామకాలపై విచారణ చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఓబులేసు డిమాండు చేశారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని కెనరా బ్యాంకు రీజనల్ మేనేజరు కె.మురళీమోహన్ అన్నారు. కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా కడప నగరంలోని భగత్‌సింగ్ పార్కు ఆవరణను కెనరాబ్యాంకు ఉద్యోగులు బుధవారం శుభ్రం చేశారు. కెనరా బ్యాంకు డివిజన్ మేనేజరు షఫీక్ అహ్మద్, విలియంకుమార్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: గాంధీనగర్ ఉన్నతపాఠశాల విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం కడపలోని బిజివేముల వీరారెడ్డి రైతుబజారులో శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. రైతుబజారు ఎస్టేట్ అధికారి సామంత్‌నాయక్, కానాల ట్రస్ట్ ప్రతినిధి ఈశ్వరయ్య, తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికి పరిమితమైన మృకుండాశ్రమం నివాసి సాయి మధుసూదన్ కుటుంబానికి సిద్దవటం మండలం మాధవరం-1కు చెందిన మన ఊరి కోసం స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సాయం చేశారు. సంస్థ ఛైర్మన్ అవ్వారు రవిశంకర్ దాతల సహకారంతో రూ.10 వేలు విలువ చేసే నిత్యావసర సరకులు, మరో రూ.17,700 నగదును అందజేశారు. రామకృష్ణ, సుధీర్, శివారెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. ఇటీవల విజయవాడ వరదల్లో సేవలందించిన కడప కార్మికుల సత్కార కార్యక్రమం నగరంలోని నూర్జహాన్ కల్యాణమండపంలో జరిగింది. పలువురు నగరపాలక సంస్థ అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

గ్రామసభ వాయిదా

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలోని కొండమాచుపల్లె పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను పనుల గుర్తింపు గ్రామ సభ వాయిదా పడింది. గతంలో తెదేపా వర్గీయులు సర్పంచిగా ఉన్న సమయంలో పంచాయతీకి స్వచ్ఛ పురస్కారాలు లభించాయి. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న చిత్రాలు ప్రస్తుతం కనిపించలేదు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌ను తెదేపా నాయకులు గట్టిగా నిలదీశారు. కాసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. దీంతో గ్రామసభను తాత్కాలికంగా వాయిదా వేశారు.